సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఇంటింటికీ కుళాయిల నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.19 లక్షలతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణ పనులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుళాయిల నిర్మాణం వల్ల ప్రతి ఇంటి ముంగిటకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. కుళాయిల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ చిరంజీవి, బాందేవుపురం కో – ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ కనకల ప్రకాష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు జరగవని న్యూఢిల్లీ స్కూల్ ఆఫ్ జర్నలిజం వైస్ చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. రోడ్డు భద్రతపై స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది సరైన జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అందువల్ల ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించడంతోపాటు వాహనాలను తక్కువ వేగంతో నడపాలని సూచించారు. కార్యక్రమంలో సర్వశిక్ష ఏసీపీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సభ జయప్రదం చేయండి

తగరపువలస: సంగివలసలో ఈ నెల 27న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, ఇతర ముఖ్య నాయకులతో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ కౌన్సిలర్ జీవీ రమణ కోరారు. ఈ మేరకు పార్టీకి చెందిన మహిళలు, గృహ సారథులు, కన్వీనర్లతో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అధ్యాపకుల సంఘ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెజిటెడ్ అధ్యాపకుల సంఘ డైరీని ప్రిన్సిపాల్ మంజుల గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యాపకులందరూ విద్యార్థులకు మంచిగా బోధించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యాపకుల సంఘ అధ్యక్షులు డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, విజయనగరం జిల్లా సంఘ కోశాధికారి బి.ప్రసాదరావు, డాక్టర్ బి.సహదేవుడు, మాధురి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

భీమునిపట్నం: పదో తరగతి విద్యార్థులంతా చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం సూచించారు. దీవీస్ సంస్థ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు గురువారం అందించారు. ఈ మెటీరియల్ వినియోగించుకుని ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత పొందాలని కోరారు.

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి



సభకు విశేషంగా హాజరైన లబ్ధిదారులు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- మధురవాడలో ఆసరా సాయం రూ.15 కోట్లు పంపిణీ



మధురవాడలో మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మధురవాడ: మహిళా సాధికారితతో సమాజాభివృద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మధురవాడ సాయిరాం కాలనీలో గురువారం నిర్వహించిన సభలో లబ్ధిదారులకు రూ.15 కోట్ల ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారీ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లలంటే సమాజంలో చిన్నచూపు ఉందని, వారిని అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాల్సి ఉందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి అన్ని రంగాల్లో అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆసరా నిధులు, అమ్మ ఒడి, ఇళ్ల పట్టాలు వంటివి మహిళల పేరునే ఇస్తున్నారన్నారు. స్థానిక సంస్థల్లో కూడా మెజారిటీ సీట్లు వారికే కేటాయించారన్నారు. అర్హులందరికీ కులం, ప్రాంతం, రాజకీయం వంటి విషయాలతో వివక్ష చూపకుండా అవినీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న నాయకుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి కావాలో.. అనునిత్యం పక్షపాతం, జన్మభూమి కమిటీల పెత్తనంతో పాలించే వారు కావాలో ఆలోచించుకోవాలన్నారు. సీఎం జగన్‌ను అందరూ ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలు, ఆర్‌పీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జెడ్సీ కనక మహాలక్ష్మి, వార్డు జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, మహిళా నాయకులు బండారు శివలక్ష్మి, గోడి అరుణ, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, బి.శ్యామలరావు, వైఎస్ మూర్తి, యోగేశ్వరరావు, సింహాచలం, కూన రమణ, ప్రసాద్, జేఎస్ రెడ్డి, బాబ్జి, మితాన రమణమ్మ, ముచ్చు రామారావు, బగాది లక్ష్మణ, బోయి సూర్రెడ్డి, వంకర అప్పారావు, సంతోష్, కావ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాబు ఆదుకున్నారు



నన్ను కొడుకు వదిలేసి వెళ్లిపోయాడు. కొడుకులు చూడని నాలాంటి తల్లులు చాలామంది ఉన్నారు. వారందరినీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదుకున్నారు. నాకు ఆయన ఇంటికి పంపిస్తున్న పింఛన్ డబ్బులే జీవనాధారం. ఆ మహానుబావుడికి చేతులెత్తి దండం పెట్టడం తప్ప.. ఏ విధంగానూ రుణం తీర్చుకోలేము. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– సరోజిని, మారికవలస

హామీలన్నీ నెరవేర్చారు



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు. గతంలో సర్టిఫికెట్లు, ఇతర అవసరాల కోసం దూరంగా ఉన్న కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు వలంటీర్ల ద్వారానే అన్ని పనులూ చేయిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసి, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. గతంలో పింఛన్ల కోసం ఎదురుచూస్తే... ప్రస్తుతం ఇంటికే అందిస్తున్నారు.

– లక్ష్మి, వైఎస్సార్ కాలనీ, మధురవాడ

సబ్ పోస్టాఫీసుతో విస్తృతంగా సేవలు



సబ్ పోస్టాఫీసు ప్రారంభిస్తున్న విక్రమ్

ఆనందపురం : పోస్టాఫీసులను అప్‌గ్రేడ్ చేయడం వల్ల ప్రజలకు విస్తృతంగా సేవలు అందుతాయని పోస్టల్ డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ పి.విక్రమ్ తెలిపారు. మండలంలోని శొంఠ్యాంలో ఉన్న బ్రాంచి పోస్టాఫీసుని సబ్ పోస్టాఫీసుగా అప్‌గ్రేడ్ చేయగా గురువారం ఆ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సూపరింటెండెంట్ విక్రమ్ మాట్లాడుతూ బ్రాంచి పోస్టాఫీసులో స్వల్పకాలిక సేవలే ఖాతాదారులకు అందుతాయన్నారు. శొంఠ్యాం బ్రాంచిలో కార్యకలాపాలు ఎక్కువగా జరగడం, ఖాతాదారులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఇక్కడ సేవలను విస్తృతం చేయాలనే ఉద్దేశంతో అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఏటీఎం మెషీన్ ఏర్పాటు చేయడం వల్ల పొదుపు ఖాతా తెరిచిన ప్రతి ఖాతాదారుడికి కార్డు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఐపీవో ఎస్.ప్రభుదాస్, బీపీఎం కె.కృష్ణ, లెంక రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కోరాడ వెంకట రమణారావు తదితరులు పాల్గొన్నారు.

‘27న హక్కు పత్రాలతో కలెక్టరేట్‌కు రండి’

తగరపువలస: విశాఖ రూరల్ మండలం కొమ్మాది సర్వే నంబర్ 145లో 39.70 ఎకరాల భూమికి సంబంధించి హక్కు పత్రాలతో ఈ నెల 27న ఉదయం 11 గంటలకు గూనూరు వెంకటరావు హాజరుకావాలని కలెక్టరేట్‌కు చెందిన కె.మోహన్‌కుమార్ కోరారు. నగర శివారులోని వేపగుంట వద్ద అప్పన్నపాలెం నివాసి అయిన వెంకటరావు ఈ భూమిని 22ఎ జాబితా నుంచి డీనోటిఫై చేయమని గతేడాది రాష్ట్ర న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు విచారణ నిమిత్తం కలెక్టర్ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేసినా వెంకటరావు స్పందించ లేదు. చివరి అవకాశంగా వెంకటరావు హాజరుకాకపోతే క్షేత్ర స్థాయి నివేదికలు, కార్యాలయంలో అందుబాటులో వున్న ఆధారాలతో తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు ఆయన హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడకు చెందిన పట్నాలు రమేష్ కనిపించడం లేదని అతని తల్లి గురువారం భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పది సంవత్సరాల క్రితం రమేష్‌కు కుసుమ అనే అమ్మాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. కుటుంబ కలహాల కారణంగా 7 సంవత్సరాల క్రితం విడిపోయారు. ఒంటరిగా ఉంటున్న రమేష్ కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో పని చేసుకుంటున్నాడు. అప్పుడప్పుడు వస్తూ తల్లిదండ్రులను చూసుకునేవాడు. గత సంవత్సరం అక్టోబర్‌లో వచ్చిన రమేష్ కొన్ని రోజులు ఉండి తిరిగి పనికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఫోన్ కూడా పని చేయకపోవడంతో తల్లిదండ్రులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్కూబా డైవింగ్‌లో ధీరజ్ రికార్డ్



స్కూబా డైవింగ్ చేస్తున్న ధీరజ్

కొమ్మాది: చిన్న వయస్సులో స్కూబా డైవర్స్ జాబితాలో చేరిన పడాల ధీరజ్ (10)ను లైవ్ ఇన్ అడ్వంచర్స్ వ్యవస్థాపకుడు బి.బలరామనాయుడు అభినందించారు. అతి చిన్న వయస్సులోనే ప్రపంచ వ్యాప్తంగా స్కూబా డైవింగ్ జాబితాలో చోటు దక్కించుకున్న ఏకైక బాలుడు ధీరజ్ అన్నారు. బాలికల్లో దేబో ప్రియ సాహా ఈ చోటు దక్కించుకున్నారని, వీరిద్దరూ మన విశాఖ నుంచి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. విశాఖలో నీటి అడుగున అన్వేషణ పట్ల ప్రతి ఒక్కరికీ ఆసక్తి పెరుగుతోందన్నారు.

పార్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

మేయర్ హరివెంకట కుమారి



బింద్రానగర్‌లో పార్కు పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, అధికారులు

మధురవాడ: జీవీఎంసీ పార్కుల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ బింద్రానగర్ షిప్‌యార్డు లే అవుట్‌లో పార్కు ఆక్రమణకు గురవుతోందని, ఆక్రమణ తొలగించాలని అందిన ఫిర్యాదు మేరకు ఆమె అధికారులతో కలసి ఆ స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరు పార్కు స్థలాన్ని పరిశీలించామని, సంబంధిత పత్రాలను పరిశీలించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పార్కును పరిరక్షించి ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీడీహెచ్ చక్రవర్తి, జెడ్సీ కనక మహాలక్ష్మి, అసిస్టెంట్ సీటీ ప్లానర్ షెబ్‌నాస్ శాస్త్రి పాల్గొన్నారు.

ఆశీలు వేలంపాట రూ.10.55 లక్షలు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద గురువారం తగరపువలస రోడ్డు మార్జిన్‌కు సంబంధించి ఆశీలు వేలంపాటు ఖరారయ్యింది. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో తగరపువలసకు చెందిన బర్ల రామారావు రూ.10.55 లక్షలకు వేలం ఖారారు చేసుకున్నారు. భీమిలి రోడ్డు మార్జిన్‌కు కూడా వేలం నిర్వహించగా ఎవరూ ఆసక్తి చూపలేదు.

వివాహిత అదృశ్యం

తగరపువలస: విజయనగరం జిల్లా గోపాలరాజుపురానికి చెందిన సీర శ్రావణి అనే వివాహిత ఈ నెల 23న సంగివలస అనిల్ నీరుకొండ నర్సింగ్ కళాశాలకు వెళ్లి అదృశ్యమయింది. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం కన్నమరాజుపేటకు చెందిన ఆమె తల్లి మండల జయలక్ష్మి ఈ మేరకు గురువారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాలుగు మాసాల క్రితం త్రినాథ్ అనే వ్యక్తితో శ్రావణి వివాహం జరిగింది. కాగా ఆమెను త్రినాథ్ మానసికంగా, శారీరకంగా హింసించేవాడని ఫిర్యాదులో పేర్కొంది. శ్రావణికి ఇష్టం లేకపోయినా ఈ నెల 22న త్రినాథ్ సంగివలస నర్సింగ్ కళాశాలలో చేర్పించాడు. 23న ఉదయం 10 గంటల సమయంలో కళాశాలకు వచ్చిన ఆమె తిరిగి వెళ్లిపోయింది. జయలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

భీమునిపట్నం: సమస్యలు పరిష్కరించాలని భీమిలి తాలూకా పింఛన్‌దారుల సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డీవో కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు టి.భీమారావు, ఎం.ఆనందరావు మాట్లాడుతూ తమకు అందాల్సిన డీఆర్, పీఆర్‌సీ బకాయిలను ప్రభుత్వం అందివ్వాలని కోరారు. అన్ని ఆస్పత్రుల్లోనూ చికిత్స పొందే అవకాశం కల్పించాలని, గతంలో మాదిరిగా పింఛన్లు పెంచాలని కోరారు.

ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



ఎన్నికైన విశాఖ ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ

మధురవాడ: మధురవాడలోని విశాఖ ఫాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. ఐటీ రోడ్డులోని జీసస్ హోలీ ఫైర్ మినిస్ట్రీస్ చర్చిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా కె.లత సుధాకర్, ప్రెసిడెంట్‌గా బిషప్ డాక్టర్ ఉరుకూటి జాన్ మేరీ, కార్యదర్శిగా కె.ప్రభుదాస్, జాయింట్ సెక్రటరీగా లక్కోజు కుమార్, ట్రెజరర్‌గా టి.అభిలాష్, జాయంట్ ట్రెజరర్‌గా పి.శామ్యూల్ భారతి ఎన్నికయ్యారు.

సంగివలసకు మహర్దశ

- సీఎం జగన్ బహిరంగ సభకు ముస్తాబు
- చురుగ్గా రోడ్డు, హెలిప్యాడ్ నిర్మాణం



వేదిక నిర్మాణంలో సూచనలు ఇస్తున్న సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురామ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంగివలసలో నిర్వహించనున్న సభాస్థలం

తగరపువలస: భీమిలి జోన్‌లో మొట్టమొదటి సారిగా భారీ బహిరంగ సభకు సంగివలస ఆతిథ్యం ఇవ్వనుంది. అది కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న అక్కరమాని అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు చెందిన స్థలం ముస్తాబవుతోంది. ఇప్పటి వరకు చిట్టివలస బంతాట మైదానం, అంబేడ్కర్ కూడలి, భీమిలి ప్రాంతాల్లోనే పెద్ద సభలు నిర్వహించేవారు. మొట్టమొదటి సారిగా సంగివలసను ఈ సభకు వినియోగించడం వెనుక అనేక అంశాలు కలిసి వస్తున్నాయి. సంగివలస – నమ్మివానిపేట రహదారిలో సభ నిర్వహణకు, వాహనాల పార్కింగ్‌కు ఖాళీ స్థలాలు ఉండటమే కాకుండా, సీఎం వైఎస్ జగన్ వచ్చే హెలికాప్టర్ ల్యాండ్ కావడానికి అవసరమైన విశాల స్థలం ఉంది. సభా స్థలం ముందు ఆరులైన్ల జాతీయ రహదారి, సభ నిర్వహణ స్థలానికి చేరుకోవడానికి అనిట్స్ కళాశాల రహదారి, నమ్మివానిపేట రహదారి, వరల్డ్ అమేయా స్కూల్ రహదారులు ఉన్నాయి. ఇక్కడకు చేరువలో సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయం, బంగ్లామెట్ట శివాలయం ఎదురుగా గోస్తనీ నది తీర ప్రాంతాలు, చిట్టివలస బంతాట మైదానం, జ్యూట్‌మిల్లు రహదారులు ఉన్నాయి. ఆయా చోట్ల 2 వేల వరకు బస్సులు, 5 వేల వరకు కార్లు, మరో 5 వేల ద్విచక్ర వాహనాలు నిలిపేందుకు అనువైన స్థలాలు ఉన్నాయి. ఇప్పుడు సభ జరుగుతున్న మార్గంలో నమ్మివానిపేట చేరుకోవడానికి ఉన్న గ్రావెల్ రోడ్డు బీటీ రోడ్డుగా మారబోతుంది. సుఖీభవ కాలనీకి వెళ్లే మార్గం, సర్వీస్ రహదారులపై ఇసుక కుప్పలు తొలగించడంతోపాటు రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతున్నారు. ఇందుకోసం వందలాది మంది కార్మికులు, జేసీబీలు, ప్రొక్లెయినర్లు, లారీలు, రోడ్లు శుభ్రం చేసే వాహనాలను వినియోగిస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన పెయింటింగ్ పనులు చేపడుతున్నారు. అంతేకాకుండా ఈ మారుమూల ప్రాంతంలో ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో హెలీప్యాడ్ కూడా నిర్మిస్తున్నారు. ఈ మార్గంలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌కు సంబంధించి ట్రయల్ రన్ త్వరలో నిర్వహించనున్నట్టు తెలిసింది.



సంగివలస - నమ్మివానిపేట రహదారికి హంగులు

ప్రజాస్వామ్యానికి ఓటే తొలిమెట్టు



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు



మానవహారంగా విద్యార్థులు

తగరపువలస: ప్రజాస్వామ్యానికి ఓటు తొలిమెట్టు అని, దీనిని ఎవరూ దుర్వినియోగం చేసుకోకూడదని కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఓటు విలువ నాటిక ప్రదర్శించారు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్ట పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఇటీవల కొత్తగా ఓటర్ల నమోదుకు, ఓటు హక్కు వినియోగానికి చాలా మంది ఆసక్తి చూపించడం లేదన్నారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించి అవగాహనా ర్యాలీ చేపట్టారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు భీమిలి మండలం చిప్పాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఆనందపురం : దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ఓటు హక్కుని దుర్వినియోగం చేయరాదని విశ్వనాథ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమాదేవి అన్నారు. మండలంలోని శొంఠ్యాం పంచాయతీ పరిధిలోని మిందివానిపాలెంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో టి.సమన్వయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇది అందరి బాధ్యత అని తహసీల్దార్ రమేష్ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించారన్నారు. దాని ప్రకారం ప్రజాప్రతినిధులను ఎన్నుకునే బాధ్యత అందరిపైనా ఉందని, ఆ హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవో డాక్టర్ జానకి మాట్లాడుతూ ఓటు హక్కు చాలా గొప్పదని, దాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించడంతోపాటు ఓటు వేసే విధానాన్ని నమూనా ఓటు యంత్రం ద్వారా ప్రదర్శించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వేణుగోపాల్, ప్రసాదరావు పాల్గొన్నారు.